# ఉక్కులో ఉద్యోగులు కుదింపు?

- శాశ్వత ఉద్యోగులు 9,510 మందికి, కాంట్రాక్టు ఉద్యోగులు 9,930 మందికి పరిమితం
- ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి కేంద్రం అంచనా?



- ప్లాంటులో జోరుగా ప్రచారం
- అంతకుమించి ఉన్నవారిని సాగనంపడానికి యత్నం
- 2,500 మందికి వీఆర్ఎస్
- నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు 500 మంది డిప్యుటేషన్
- మరికొందరు సెయిల్‌కు...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఒకవైపు ప్లాంటును కాపాడతామని భరోసా ఇస్తూనే...మరో వైపు ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికిచర్యలు చేపడుతోంది. ఓ ప్రైవేటు సంస్థతో సర్వే చేయించి విశాఖ ఉక్కు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు కాబట్టి అందుకు తగ్గట్టుగా 9,510 మంది శాశ్వత ఉద్యోగులు, 9,930 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటే సరిపోతుందనే నిర్ణయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ లెక్క ప్రకారం ఉద్యోగులు అధికంగా ఉన్నారని, వారిలో 2,500 మందికి స్వచ్ఛంద పదవీ విరమణ ఇవ్వాలని, మరో 500 మందిని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని, మరికొందరిని సెయిల్‌కు పంపాలని యత్నిస్తోంది. గత మూడు రోజుల్లో విశాఖలో ఎన్ఎండీసీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా కేవలం 49 మంది మాత్రమే వెళ్లడానికి అంగీకారం తెలిపారు. తాజాగా రాయబరేలిలోని ఫోర్జ్‌డ్ వీల్‌ప్లాంటులో పనిచేస్తున్న 55 మంది విశాఖ ఉక్కు ఉద్యోగులను రైల్వేకు ఐదేళ్ల డిప్యుటేషన్‌పై పంపాలని నిర్ణయించారు.

విశాఖ ఉక్కు కర్మాగారం 2004-2017 మధ్య కాలంలో రూ.12 వేల కోట్ల లాభం ఆర్జించింది. అప్పుడు ప్లాంటులో 22 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండేవారు. ఇప్పుడు శాశ్వత ఉద్యోగుల సంఖ్య 12,672కి పడిపోయింది. కొందరు పదవీ విరమణ చేయగా, మరి కొందరు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రభుత్వ రంగంలోనే ఉన్న సెయిల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.963 కోట్ల టన్నులు. అక్కడ 54,840 మంది పని చేస్తున్నారు. ఆ లెక్కన పది లక్షల టన్నులకు 2,793 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. అదే ప్రాతిపదికగా తీసుకుంటే విశాఖ ఉక్కులో 73 లక్షల టన్నులకు 20,393 మంది శాశ్వత ఉద్యోగులు ... మిగతా 6వ పేజీలో

## ఉక్కు ఉద్యోగులకు ఇంకా పూర్తిగా అందని జీతాలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 26: గత నెలకు సంబంధించిన జీతాలు స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు ఇంకా పూర్తిగా అందలేదు. ఈ నెల ఆరో తేదీన కార్మికులు, అధికారులకు సగం జీతం బ్యాంకులో జమ చేసిన యాజమాన్యం...25వ తేదీ వచ్చినా మిగతా సగం జీతం ఊసెత్తడం లేదని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. గత కొన్ని నెలలుగా ఉక్కు ఉద్యోగులకు నెల జీతం రెండు వాయిదాల్లో ఇస్తున్నారు. అయితే ఈ నెల చివరికి వచ్చినప్పటికీ ఇంకా సగం జీతం ఇవ్వలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్



అప్పన్న ఆలయంలో కప్ప స్తంభం వద్ద మంత్రి నారా లోకేశ్

- పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరణ
- కాంట్రాక్టు నర్సుల సమస్యలు పరిష్కరించాలని కోరిన ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ
- వైసీపీ హయాంలో దళితులపై జరిగిన హత్యాకాండపై విచారణ చేయాలన్న దళిత సంఘాల ఐక్య వేదిక

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి విచ్చేసిన ఆయన తొలిరోజు సీఐఐ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం అదానీకి డేటా సెంటర్ నిమిత్తం మధురవాడ ప్రాంతంలో కేటాయించిన కొండను పరిశీలించారు. ఆ తరువాత ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాడిసన్ హోటల్‌లో సమావేశమై ఉక్కు కర్మాగారం సమస్యపై చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని ... మిగతా 6వ పేజీలో



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

# పర్యాటకంపై నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో ఎన్నో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు


- ప్రచారం పూజ్యం... వసతులు శూన్యం...
- నిరుపయోగంగా క్రూయిజ్ టెర్మినల్
- ఏడాది కిందట ప్రారంభం... ఇప్పటివరకూ కనీసం ఒక్క క్రూయిజ్‌ను తీసుకురాలేకపోయిన అధికారులు
- రెండు శాఖల మధ్య సమన్వయలోపంతో తొట్లకొండపై పర్యాటకులకు అసౌకర్యం
- సీజన్ ప్రారంభమవుతున్నా అందుబాటులోకి రాని యాత్రీ నివాస్
- రూ.కోట్ల వ్యయం...అక్కరకు రాని వైనం
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లా పర్యాటక రంగానికి పట్టుగొమ్మ. అందమైన సాగర తీరం, ఆకట్టుకునే అరకు సోయగాలు, విదేశీయులను ఆకర్షించే బౌద్ధ క్షేత్రాలు, అరుదైన ఎర్రమట్టి దిబ్బలు, కేరళను తలపించే కొండకర్ల ఆవ... ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. కానీ వసతులు శూన్యం. ప్రచారం పూజ్యం. పర్యాటక రంగం పచ్చగా ఉంటే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అయితే కొత్త కొత్త ప్రాజెక్టులు ప్రకటించడమే తప్ప అధికారులు వాటిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాలేకపోతు న్నారు. పర్యాటక శాఖకు పూర్తిస్థాయి అధికారులు లేరు. ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చినవారు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారు. అక్కడ కూడా విభేదాలు, విద్వేషాలు. ఇదీ పరిస్థితి. కాంట్రాక్టు పద్ధతిన చిరుద్యోగంలో చేరిన వారికి ఏకంగా జిల్లా అధికారి బాధ్యతలు ఇచ్చేసి వదిలేశారు. ఉన్నత స్థాయి అధికారులు విశాఖ జిల్లాను పట్టించుకోవడం లేదనే చెప్పుకోవాలి.



క్రూయిజ్ టెర్మినల్



కొనసాగుతున్న యాత్రీ నివాస్ పనులు

## రూ.100 కోట్ల క్రూయిజ్ టెర్మినల్ వృథా

క్రూయిజ్ పర్యాటకం పెంచడానికి, విదేశీ పర్యాటకులను విశాఖపట్నం రప్పించడానికి కేంద్ర పర్యాటక శాఖ, విశాఖపట్నం పోర్టుతో కలిసి రూ.100 కోట్ల వ్యయంతో పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ నిర్మించాయి. దీనిని గత ఏడాది సెప్టెంబరు ఐదో తేదీన కేంద్ర నౌకాయాన శాఖా మంత్రి సోనోవాల్ సర్బానంద్ ప్రారంభించారు. ఏడాది పూర్తయింది. ఒక్కటంటే...ఒక్క క్రూయిజ్‌ను తీసుకురాలేకపోయారు. కేంద్ర పర్యాటక శాఖ నిధులు ఇవ్వడానికి ముందుకురావడం, కొంత వ్యయం పోర్టు భరించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో టెర్మినల్ నిర్మించేశారు. అయితే దానిని ఎలా ఆపరేట్ చేయాలి?, క్రూయిజ్‌లను ఎలా రప్పించాలి?... అనే దానిపై ఇటు పోర్టు యాజమాన్యం దృష్టిపెట్టలేదు. జిల్లా యంత్రాంగం పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధులకు ఇలాంటివి పట్టనే ... మిగతా 6వ పేజీలో

## ఆర్డీఓల బదిలీ

- ఉమ్మడి జిల్లాలో నలుగురికీ స్థాన చలనం
- విశాఖ ఆర్డీవోగా టి.శ్రీలేఖ
- భీమిలి ఆర్డీవోగా సంగీత్‌మాధుర్
- హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డిలను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం
- విజయనగరం ఆర్డీవోగా వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి

విశాఖపట్నం, సెప్టెంబరు 27: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నలుగురు ఆర్డీఓలను ప్రభుత్వం గురువారం బదిలీ చేసింది. వీరితోపాటు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, వీఎంఆర్డీఏ కార్యదర్శికి కూడా స్థానచలనం కల్పించారు. శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టి.శ్రీలేఖను విశాఖపట్నం ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డి.హుస్సేన్ సాహెబ్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.సంగీత్‌మాధుర్‌ను భీమునిపట్నం ఆర్డీఓగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఎస్.భాస్కరరెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్న షేక్ ఆయేషాను అనకాపల్లి ... మిగతా 6వ పేజీలో

## వైసీపీ జిల్లా అధ్యక్షునిగా గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమిస్తూ అధ్య క్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో అమర్‌నాథ్ గాజువాక నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ పదవిపై అమర్ ఆశలు పెట్టుకోగా, అధిష్ఠానం అనూహ్యంగా విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని అమర్‌నాథ్ కొంతకాలంగా అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అమర్‌ను నియమించినట్టు పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.



### 'పశ్చిమ' సమన్వయకర్తగా మళ్ల

పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ్‌ప్రసాద్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం సమన్వయకర్తగా పనిచేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో గతంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేసిన మళ్ల విజయ్‌ప్రసాద్‌ను తిరిగి సమన్వయకర్తగా నియమించారు.

# సుదీర్ఘంగా కౌన్సిల్ సమావేశాలు

తొలిసారిగా మూడు ఎజెండాలు... మూడు రోజులుపాటు సమావేశాలు

- 83 అంశాలపై చర్చ... 81 ఆమోదం
- ఒకటి తిరస్కృతి, మరొకటి వాయిదా
- పలుసార్లు కూటమి, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని కోరేందుకు
- ఏకగ్రీవంగా తీర్మానం



విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడు రోజులపాటు కొనసాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాలు గురువారం ముగిశాయి. ప్రధాన ఎజెండాలోని 48, అనుబంధ ఎజెండాగా 27 అంశాలతోపాటు టేబుల్ ఎజెండాగా ఎనిమిది అంశాలు మొత్తం 83 అంశాలపై కౌన్సిల్‌లో చర్చ జరిగింది. వీటిలో 81 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలపగా, విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సేవలను ఏడాదిపాటు వినియోగించుకోవాలనే అంశాన్ని తిరస్కరించారు. అలాగే నీటి సరఫరా విభాగంలోని హెల్పర్లు, ఫిట్టర్లు, కాకట ర్నర్‌లకు జీతాలను పెంచే అంశాన్ని వాయిదా వేశారు.



మేయర్ పోడియం వద్ద కూటమి, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

కౌన్సిల్ మొదటిరోజు (మంగళవారం) సమావేశంలో యూసీడీలో కుంభకోణంపై గొడవ జరగడంతో సమావేశాన్ని మేయర్ బుధవారానికి వాయిదావేశారు. రెండో రోజు సమావేశంలో 14 అంశాలపై చర్చ జరిగేసరికి రాత్రి 11 గంటలు కావడంతో గురువారం నాటికి వాయిదా వేశారు. మూడో రోజైన గురువారం నాటి సమావేశంలో ఏకంగా 69 అంశాలపై చర్చ జరిగింది. మూడో రోజు సభ ప్రారంభం కాగానే చెత్తపై యూజర్ చార్జీలు వసూలును రద్దు చేయాలని తీర్మానం చేయాలని వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు మేయర్‌ను కోరారు. దీనికి 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ... మిగతా 6వ పేజీలో

## కౌన్సిల్ రికార్డు

- ఏకంగా తొమ్మిది గంటలపాటు జీరో అవర్
- మూడున్నరేళ్లలో తొలిసారి సమస్యలపై మాట్లాడామంటూ పలువురు కార్పొరేటర్లు హర్షం
- అవినీతి, అక్రమాలపై కూటమి సభ్యుల ప్రశ్నల వర్షం
- ఉక్కిరిబిక్కిరైన మేయర్, వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాలు రికార్డు స్థాయిలో మూడు రోజులపాటు సాగాయి. మూడున్నరేళ్లుగా వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించేందుకు చాలా మందికి అవకాశం లభించకపోవడంతో తాజా సమావేశంలో అందరికీ అవకాశం కల్పించారు. దీంతో ఏకంగా తొమ్మిది గంటలపాటు జీరో అవర్ సాగింది. అలాగే కౌన్సిల్ సమావేశంలో ప్రధాన ఎజెండా కింద 48 అంశాలు, అనుబంధ ఎజెండా కింద 27 అంశాలు, టేబుల్ ఎజెండా కింద ఎనిమిది అంశాలు...మొత్తం 83 అంశాలపై కౌన్సిల్‌లో చర్చ జరిగింది. కౌన్సిల్ సమావేశం తొలిరోజు ప్రముఖుల మృతికి సంతాపం, కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సన్మానం నిర్వహించారు. అనంతరం ఎజెండాపై చర్చకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రకటించగా, సభ్యులంతా జీరో అవర్ ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే భోజన విరామం తర్వాత తిరిగిసభ ప్రారంభం కాగానే యూసీడీ విభాగంలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై ముందు చర్చించిన తర్వాత జీరో అవర్‌కు వెళ్లాలని టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నారావు కోరడంతో మేయర్ అంగీకరించారు. కుంభకోణంలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్‌కు కూడా వాటాలు అందాయని అభియోగం ... మిగతా 6వ పేజీలో

# భారీ వర్షం



బీచ్‌రోడ్డులోని నొవాటెల్ హోటల్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

| మండలం | బుధవారం ఉదయం 8 నుంచి గురువారం మధ్యాహ్నం 2 వరకు |
|---|---|
| సీతమ్మధార | 4.26 సెం.మీ. |
| విశాఖ రూరల్ | 3.94 సెం.మీ. |
| మహారాణిపేట | 3.28 సెం.మీ. |
| పెందుర్తి | 2.36 సెం.మీ. |
| పెదగంట్యాడ | 2.34 సెం.మీ. |
| గాజువాక | 1.94 సెం.మీ. |
| భీమునిపట్నం | 1.74 సెం.మీ. |
| గోపాలపట్నం | 1.68 సెం.మీ. |
| ములగాడ | 1.5 సెం.మీ. |
| ఆనందపురం | 0.72 సెం.మీ. |
| పద్మనాభం | 0.05 సెం.మీ. |

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సీతమ్మధారలో అత్యధికంగా 4.26 సెం.మీ.

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా విశాఖ జిల్లాలో బుధవారం రాత్రి నుంచి వర్షం పడుతోంది. గురువారం తీవ్రత మరింత పెరిగింది. ఉదయం నుంచి దఫదఫాలుగా పడుతూనే ఉంది. గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సీతమ్మధారలోనే 4.26 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పద్మనాభంలో అత్యల్పంగా 5 మి.మీ. నమోదైంది. మొత్తం 11 మండలాల్లో సగటున 2.21 సెం.మీ. కురిసింది. ఈ భారీ వర్షానికి పూర్ణామార్కెట్ జలమయమైంది. వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీచ్‌రోడ్డు పూర్తిగా నీటితో నిండిపోయింది. సందర్శకులు కరువయ్యారు. ఎంవీపీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట, తదితర ప్రాంతాల్లో గెడ్డల్లో నీరు రోడ్లపైకి వచ్చింది. చాలా కాలనీల్లో నీరు అపార్టుమెంట్ల ... మిగతా 6వ పేజీలో

## తప్పులు పునరావృతం కానీయొద్దు: కలెక్టర్

**మహారాణిపేట, సెప్టెంబరు 26:** ఓటర్లు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ ఎన్నికల విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 28లోగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, అనుబంధ పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్తవాటికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్వో మోహనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా హెరిటేజ్ వాక్**

జిల్లాలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను తెలిపేలా జిల్లా పర్యటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. గురువారం రాష్ట్ర పర్యటక శాఖ అధికారుల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఉన్న టౌన్ హాల్ నుంచి పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. చారిత్రక ప్రదేశాలను గుర్తించాలని కోరుతూ పర్యటక దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని గోడ పత్రికలను ప్రదర్శించారు. పర్యటక శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ ఫణి, జ్ఞానవేణి, ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డ్వామా పీడీగా ఆర్.పూర్ణిమదేవి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారిణి

**డాబాగార్డెన్స్:** డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్.పూర్ణిమదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



# ఎడతెరిపిలేని వర్షంతో అవస్థలు


జలమయమైన పూర్ణామార్కెట్ ప్రాంతం


ద్వారకానగర్ పౌరగ్రంథాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

**జగదాంబ కూడలి, సెప్టెంబరు 26:** నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం కుండపోతగా కురిసిన వర్షంతో పూర్ణామార్కెట్ లోపల, రోడ్డు పరిసరాలు జలమయమయ్యాయి. పూర్ణామార్కెట్ నుంచి కురుపాం మార్కెట్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడం వల్లే ప్రతీసారి చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని వ్యాపారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నుంచి వర్షం నీరు దుర్గాలమ్మ గుడి వైపు పొంగుతూ రావడం వల్ల ప్రధాన రహదారులు నీట మునిగాయని చిరువ్యాపారులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. కూరగాయల వ్యాపారుల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. వన్‌టౌన్ పరిసర ప్రాంతాల ప్రజలు వర్షంతో విలవిలలాడారు.

**సీతంపేట:** ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. రామాటాకీస్ డౌన్ రోడ్డు, శాంతిపురం రహదారుల్లో, ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం ఎదుట రోడ్డుపై వర్షం నీరు పెద్దఎత్తున పారింది. అటుగా వచ్చిన వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ద్వారకానగర్‌లో బీవీకే కళాశాల ఎదురు రోడ్డు, పౌర గ్రంథాలయం పక్కరోడ్డులో చెట్టు విరిగి పడింది. దీంతో రాకపోకలకు కొంతసేపు ఆటంకం కలిగింది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా చెట్టు కొమ్మలు తొలగించడానికి వీలుపడలేదు. దీంతో వాటి కింది నుంచే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించారు.

# పర్యాటకంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పట్టవు. దాంతో రూ.100 కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. ఇటీవలె క్రూయిజ్‌లను ఎలా రప్పించాలనే దానిపై టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో తెలియదు.

**పోర్టు నెత్తిన మౌలిక వసతుల బాధ్యత**

జిల్లాలో పర్యాటక కేంద్రాలు అనేకం ఉన్నాయి. కానీ అక్కడ పర్యాటకులకు మౌలిక వసతులు లేవు. ఇన్నాళ్లూ వాటి గురించి అధికారులు పట్టించుకోలేదు. విశాఖపట్నం పోర్టుకు క్రూయిజ్‌లో వచ్చే విదేశీ పర్యాటకులు ఆయా కేంద్రాలను సందర్శిస్తే...మౌలిక వసతులు తప్పనిసరి కాబట్టి అవన్నీ పోర్టు యాజమాన్యమే సమకూర్చాలని జిల్లా అధికారులు ఇటీవల తేల్చి చెప్పారు. క్రూయిజ్‌లు విశాఖ వచ్చేలోపు ఆ పనులన్నీ చేసే బాధ్యత అప్పగించారు.

**తొట్లకొండపై తాళం**

తొట్లకొండను పురావస్తు శాఖ నిధులతో అభివృద్ధి చేశారు. నిర్వహణను వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. అది బౌద్ధ కేంద్రం. దానికి విశిష్టతలు ఉన్నాయి. పర్యాటకులు అక్కడి కి వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ చెప్పాలనే ఉద్దేశంతో అక్కడ ఇంటర్ ప్రిటేషన్ రూమ్ ఒకటి నిర్మించారు. రెండు సంస్థల మధ్య సరైన అవగాహన లేకపోవడంతో దానికి తాళం వదిలేసి వదిలేశారు. అక్కడికి ఎవరైనా వెళితే బౌద్ధ ఆరామం చూసి రావాలే తప్ప దాని ప్రత్యేకత ఏమిటో తెలుసుకునే అవకాశం లేదు. అధికారుల తీరు ఎలా ఉంటుందనే దానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే.

**ఇంకెప్పుడు అందుబాటులోకి తెస్తారో..?**

పర్యాటక శాఖపై అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో నచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. అక్టోబరు నుంచి పర్యాటక సీజన్ ప్రారంభమవుతుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారు. వారు తొలుత పర్యాటక శాఖ వసతినే కోరుకుంటారు. గతంలో రుషికొండలో హరిత రిసార్ట్స్ ఉండేవి. వాటిని జగన్ ప్రభుత్వం కూలగొట్టడంతో కేవలం అప్పుఘర్ వద్ద ఉన్న యాత్రీ నివాస్‌లోనే బస చేయాల్సి వస్తోంది. ఇప్పుడు దానిని కూడా ఆధునికీకరణ పేరుతో మూసేశారు. అంచనా వ్యయం రూ.13 కోట్లకు తీసుకువెళ్లారు. ఇంత చేసినా ఇంజనీరింగ్ అధికారులు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగానైనా దానిని అందుబాటులోకి తెచ్చారా? అంటే ఇంకా లేదు. సీజన్ ముంచుకువస్తున్నా ఆ పనులు పూర్తిచేయడం లేదు. పర్యాటకులు ఆన్‌లైన్‌లో రూమ్ బుక్ చేసుకోవడానికి యత్నిస్తే 'నాట్ ఎవైలబుల్' అని చూపిస్తోంది. ఇది ప్రారంభమైతే 44 రూమ్‌లు అందుబాటులోకి వస్తాయి. విశాఖ వచ్చే పర్యాటకులకు కనీసం ఒక గదిని కూడా ఇవ్వలేని దుస్థితిలో ఆ శాఖ ఉందంటే వారి పనితీరు ఏ విధంగా ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు.

**అంతా ఆంగ్లమే**

పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు మూడు రోజులుగా రకరకాల పోటీలు, ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అదంతా ఇంగ్లీష్‌లోనే జరుగుతోంది. తెలుగు మచ్చుకైనా లేదు. ముందస్తుగా గురువారం 'హెరిటేజ్ వాక్' నిర్వహించారు. ఆ ప్రచార నినాదాలు కూడా ఇంగ్లీష్‌లోనే ఉన్నాయి. అధికారుల తీరు మారితే తప్ప విశాఖలో పర్యాటక రంగం ముందుకువెళ్లే అవకాశం కనిపించడం లేదు.

# అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం: విష్ణుకుమార్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

**అక్కయ్యపాలెం, సెప్టెంబరు 26:** ఉత్తర నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో గురువారం 26, 44, 55 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రవేశపెట్టి 2.12 లక్షల ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎవరికైనా ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.4 లక్షల సబ్సిడీ ఇస్తాయని చెప్పారు. 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం పొందవచ్చని విష్ణుకుమార్‌రాజు తెలిపారు. షాదీఖానాను తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్, 26వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముక్కా శ్రావణి, 26, 44, 55 వార్డుల కూటమి అధ్యక్షులు ముక్కా కిశోర్‌కుమార్, బండి కన్నా, రఘునాథ్, గౌరీ శంకర్‌నాయుడు, పడాల పరమేశ్, వీరబాబు, జడ్సీలు శివరాంప్రసాద్, రాము, సీవో బీఎన్ రత్నం పాల్గొన్నారు.

## 'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయొద్దు'


టెండర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

**అక్కయ్యపాలెం, సెప్టెంబరు 26:** పోర్టు ఆసుపత్రిని ప్రైవేటు పరం చేయకుండా సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సీఐటీయూ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ఆవరణలో గురువారం టెండర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు లాభాలతో గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని 150 పడకల సామర్థ్యంతో ప్రారంభించారని, 35 వేల కుటుంబాలకు సేవలందిస్తోందని గుర్తు చేశారు. ఈ ఏడాది పోర్టుకు రూ.386 కోట్ల లాభం వచ్చినందున సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్తే వైద్యం వేలాది కుటుంబాలకు దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పోర్టు, డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రామలింగేశ్వరరావు, మారడపూడి ఆనంద్, త్రినాథ్ పాల్గొన్నారు.

## ఉక్కులో ఉద్యోగులు కుదింపు?

... 5వ పేజీ తరువాయి

ఉండాలి. కానీ 12,672 మందే ఉన్నారు. ఇంకా 8 వేల మందిని నియమించాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం పార్లమెంటులో ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ విశాఖ ఉక్కులో ఐదు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కొత్తవారిని ఎలాగూ తీసుకోవడం లేదు. ఉన్నవారిని కూడా బయటకు పంపించేందుకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ యత్నించడాన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**ఉత్పత్తికి తగ్గట్టుగా ఉద్యోగులు ఉండాలి**

విశాఖ ఉక్కు కర్మాగారానికి రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. కానీ ఇప్పుడు 4,500 టన్నులే ఉత్పత్తి చేస్తున్నారు. కేంద్రం ముడి పదార్థాలు సమకూరిస్తే 21 వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉద్యోగుల సంఖ్య తగ్గించుకుంటూ పోతే ఆ ఉత్పత్తి అసాధ్యం. ఈ విషయం తెలిసీ ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్ణయాలు తీసుకుంటున్నదంటే ఏదో కుట్ర జరుగుతోంది. సామర్థ్యానికి తగిన ఉద్యోగులు ఉండాల్సిందే.

**- అయోధ్యరామ్, కన్వీనర్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ**

## అర్బన్ తహసీల్దార్ ఆర్ఐగా ప్రేమలత

**సీతమ్మధార:** సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐగా ఆర్‌డీవో కార్యాలయం నుంచి వచ్చిన ప్రేమలత బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఇబ్రహీం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**అల్లిపురం, సెప్టెంబరు 26:** తిరుమల శ్రీవారి లడ్డు వివాద నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గురువారం స్థానిక 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట శ్రీ బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయాన్ని శుద్ధి చేశారు. అంతకుముందు ఈవో, అర్చకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులు గోపీకృష్ణ, కందుల నాగరాజు, ఆకుల రాజు, టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఘనంగా రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఉత్సవం**

జీవీఎంసీ 34వ వార్డు కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఉన్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవం గురువారం ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆర్డీఓల బదిలీ

.. 5వ పేజీ తరువాయి

ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న చిన్నికృష్ణను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పాలకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీఓగా బదిలీ చేసి, అక్కడ ఉన్న హనుమంతు జయరాంను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇంకా వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీఓగా, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీ కలెక్టర్ బి.అఖిలను చీరాల ఆర్డీఓగా, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

## భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

సెల్లార్లలోకి ప్రవేశించింది. ఉద్యోగులు, విద్యార్థులు వర్షంలో తడుస్తూనే కార్యాలయాలు, విద్యాలయాలకు వెళ్లారు. శుక్రవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో ఒక్కో మండలంలో సగటున 1.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

# సుదీర్ఘంగా కౌన్సిల్ సమావేశాలు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ఇచ్చిన హామీ మేరకు చెత్తపన్నును రద్దు చేస్తున్నట్టు సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, ప్రత్యేకంగా దీనిపై తీర్మానం అవసరం లేదని అభ్యంతరం తెలిపారు. కావాలనుకుంటే చెత్తపన్ను రద్దు చేసిన సీఎం చంద్రబాబును అభినందిస్తూ తీర్మానం చేద్దామని ప్రతిపాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో టీడీపీ, జనసేన, వామపక్షాలు వ్యతిరేకించినా అడ్డగోలుగా ఆమోదించేసి, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం తిరిగి తీర్మానం కోరతారా?...అంటూ బాణాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు గంగారావు, స్టాలిన్ మాట్లాడుతూ ఆస్తిపన్నును ప్రస్తుతం వసూలుచేస్తున్న 0.13 శాతం నుంచి 0.10 శాతానికి తగ్గించేలా తీర్మానం చేయాలని మేయర్‌ను కోరారు. దీనికి టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన ఆస్తి పన్ను చట్ట సవరణపై కోర్టులో కేసు నడుస్తున్నందున దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్నారు. నీటి సరఫరా విభాగంలో కారుణ్య నియామకాలను ఇష్టారాజ్యంగా చేస్తున్నారని, నాలుగేళ్ల కిందట మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇటీవలే మృతిచెందిన వారి కుటుంబీకులకు వైసీపీ నేతల అండదండలతో అడ్డదారిలో ఉద్యోగాలు కల్పించడంలో ఆంతర్యమేమిటని టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదులిస్తూ ప్రస్తుతం కారుణ్య నియామకాలకు సంబంధించి 61 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారందరికీ వీలైనంత త్వరగా ఉద్యోగాలివ్వడంతోపాటు అడ్డదారిలో ఉద్యోగాలు పొందారనే ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు. జోన్-5లో నకిలీ పత్రాలతో ఏకంగా 1200 అసెస్‌మెంట్‌లు జారీచేసిన అప్పటి జోనల్ కమిషనర్ సింహాచలానికి తిరిగి నగరంలో ఎలా పోస్టింగ్ ఇచ్చారని టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నారావు ప్రశ్నించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని మూడేళ్లుగా కోరుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ బదులిస్తూ వచ్చే 45 రోజుల్లోగా దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 21వ వార్డు పరిధి కిర్లంపూడి లేఅవుట్‌లోని మునిసిపల్ గెస్ట్‌హౌస్‌కు అదనపు అంతస్థులు నిర్మాణం, ఇంటీరియర్ పనుల కోసం ఏకంగా రూ.4 కోట్ల పనులకు మేయర్ ముందస్తు ఆమోదం ఎందుకు తెలపాల్సి వచ్చిందని టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. కమిషనర్ ప్రతిపాదనలు పంపడంతోనే తాను ముందస్తు ఆమోదం ఇచ్చానని, దీనిపై ఏదైనా అనుమానం ఉంటే ఆయన్ను అడగాలని మేయర్ పేర్కొనడంతో టీడీపీ, జనసేన సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో సభలో కొంతసేపు అలజడి రేగింది. ముడసర్లోవ రిజర్వాయర్‌ను ఆనుకుని 85 ఎకరాల ఖాళీస్థలంలో సుందరీకరణ, పార్కుల ఏర్పాటుకోసం అధ్యయనం చేసి, ఆసక్తి చూపే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం పీపీపీ కింద ప్రాజెక్టును పూర్తయ్యేలా చూసేందుకు రూ.1.16 కోట్లతో కన్సల్టెన్సీని ఏర్పాటుచేసుకునే ప్రతిపాదనపై లోతుగా చర్చ జరిగింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ 836 ఎకరాల్లో విస్తరించి ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్‌లో ఎంత భూమి ఆక్రమణలకు గురైంది, ఎంతభూమిని రైల్వేకు కేటాయించారు, రూ.11 కోట్లతో ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల ఎన్ని ఎకరాలకు రక్షణ ఏర్పడింది?, గుర్రాల పార్కు నిర్మాణానికి జీవీఎంసీ అనుమతి ఉందా?, రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో అలాంటి నిర్మాణాలు చేయొద్దని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలను ఎందుకు పాటించడం లేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ బదులిస్తూ గుర్రాల పార్కు పనులను ఆపేశామని, ఇటీవలే రైల్వే శాఖకు 55 ఎకరాల భూమిని అప్పగించేశామని, రిజర్వాయర్ ప్రాంతానికి సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించేలా సుందరీకరణ పనులు మాత్రమే చేసే ప్రతిపాదన ఉందని వివరించారు. నీటిశుద్ధిప్లాంట్ల వద్ద తాగునీటి శుద్ధి కోసం రూ.రెండు కోట్ల వ్యయంతో ఆలం కొనుగోలు ప్రాతిపాదనపై చర్చ సందర్భంగా వైసీపీ కార్పొరేటర్లు పీవీ సురేష్, మహ్మద్‌ఇమ్రాన్, ఉరుకూటి చంద్రరావు మాట్లాడుతూ ఆలం (నీటిని శుద్ధి చేసేందుకు వినియోగించే రసాయనం) కొనుగోలులో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ఇకపై టెండర్లు, నాణ్యత విషయంపై ప్రత్యేక శ్రద్ధపెడతానని హామీ ఇచ్చారు. టీడీపీ కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, గాడు చిన్నికుమారి మాట్లాడుతూ క్లాప్‌వాహనాల నిర్వహణలో సిబ్బంది, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కేవలం ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెట్టేస్తున్నారని ఫిర్యాదు చేశారు. 90వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం ప్రతిపాదనను వైసీపీ నేత సూచన మేరకు ఎజెండాలో చేర్చినట్టు పేర్కొనడంతో ఆ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అభ్యంతరం వ్యక్తంచేశారు. వైసీపీ నేత చెబితే ఎజెండాలో చేర్చడం ఏమిటని మేయర్‌ను ప్రశ్నించారు. ఆ అంశాన్ని తిరస్కరించాలని కోరడంతో వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించడంతో కూటమి కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. చివరకు ఆ అంశంలో వైసీపీ నేత పేరు బదులు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రతిపాదించినట్టు సవరించడంతో ఆ అంశాన్ని ఆమోదించారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని కోరేందుకు అఖిలపక్ష కార్పొరేటర్ల బృందం ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను వైసీపీ, వామపక్షాల కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు ఎజెండాలో చేర్చినట్టు మేయర్ చదివి వినిపించడంతో కూటమి సభ్యులు అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్‌లోని 97 మంది కార్పొరేటర్లు ఏకగ్రీవంగా అఖిలపక్షం ఏర్పాటుకు తీర్మానం చేసినట్టు ప్రతిపాదించాలని, లేనిపక్షంలో ఆమోదించే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. దీంతో మేయర్ ఆ మేరకు టేబుల్ ఎజెండాను సవరించడంతో సభ్యులు ఆమోదించారు.

## కౌన్సిల్ రికార్డు

... 5వ పేజీ తరువాయి

ఉన్నందున, మేయర్ రాజీనామా చేయాలని కూటమి సభ్యులు పోడియం ముందు బైఠాయించారు. దీంతో మొదటి రోజు సభను బుధవారానికి మేయర్ వాయిదా వేశారు. రెండో రోజైన బుధవారం సభ ప్రారంభం కాగానే జీరో అవర్ కింద సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. రాత్రి తొమ్మిది గంటలు వరకూ జీరో అవర్ కొనసాగింది. తర్వాత ఎజెండాపై చర్చ ప్రారంభించారు. 14 అంశాలపై చర్చ జరిగేసరికి రాత్రి 11 గంటలు కావడంతో సభను గురువారానికి వాయిదా వేయాలని మహిళా కార్పొరేటర్లు కోరారు. దీంతో మేయర్ సభను వాయిదా వేశారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభం కావడంతో ప్రధాన ఎజెండాలోని మిగిలిన అంశాలు, అనుబంధ ఎజెండాలోని 27 అంశాలతోపాటు టేబుల్ అజెండా కింద తీసుకొచ్చిన ఎనిమిది అంశాలపై చర్చ జరిపారు. కాగా మూడు రోజుల సమావేశాల్లో కూటమి కార్పొరేటర్ల ఆధిపత్యం కనిపించింది. కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి సభలో వైసీపీ కార్పొరేటర్ల హవా కొనసాగింది. ప్రజలకు నష్టం కలిగించే అంశాలను విపక్షాలు వ్యతిరేకించినా మెజారిటీ ఉండడంతో వైసీపీ సభ్యులు ఏకపక్షంగా ఆమోదించేసుకునేవారు. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గి, టీడీపీ, జనసేన బలం పెరిగింది. దీంతో తాజా సమావేశంలో కూటమి కార్పొరేటర్ల ఆధిపత్యం కనిపించింది. ఇంతవరకూ వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నల వర్షం కురిపించడంతో వైసీపీ సభ్యులు ఖిన్నులైపోయారు. మేయర్‌తోపాటు వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావులను ప్రశ్నలు, ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. కౌన్సిల్ ఏర్పడిన తర్వాత తొలిసారి మాట్లాడే అవకాశం దక్కిందంటూ కూటమి సభ్యులతోపాటు వైసీపీ సభ్యులు కూడా సంతోషం వ్యక్తంచేయడం కనిపించింది.

# మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

బస చేశారు. గురువారం ఉదయం సింహాచలం వెళ్లి వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్న లోకేశ్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులు స్వీకరించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. పరస్పర అంగీకార బదిలీలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన వారికి పరిహారం, ఇతర సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్‌సర్వీస్‌మన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాలను వైసీపీ అండతో కొందరు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి అనే వారు మంత్రిని కలిశారు. డీఎస్సీ 2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యా దీవెన కింద బీసీ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ మంజూరుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే కారణంతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల వేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్ హత్య, కోడికత్తి శ్రీను కేసులను వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, నేతలతో మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కోండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

## వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

**అగనంపూడి, సెప్టెంబరు 26:** జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 29 వరకు ప్రత్యేక పూజలతో పాటు, హోమాలు, లక్ష కుంకుమార్చన, లక్ష తులసీపూజ, పూర్ణాహుతి, పంచామృతాభిషేకాలు వంటివి నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి తిరుప్పావడ సేవ

**అక్కిరెడ్డిపాలెం:** షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి గురువారం నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు పాతిక కిలోల పులిహోరను స్వామి వారి ముందు ప్రత్యేక వేదికపై శ్రీవారి ఆకారంలో అమర్చి పుష్పాలు, పండ్లతో సుందరంగా తీర్చిదిద్ది శ్రీనివాస గద్యాన్ని ఆలపిస్తూ నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి నేత్ర, నిజరూప దర్శన భాగ్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### 1,323వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

**కూర్మన్నపాలెం, సెప్టెంబరు 26:** స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,323వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేసేందుకు కేంద్రంపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. పూర్తి సామర్థ్యంలో స్టీల్‌ప్లాంటును నడిపితే 2030 నాటికి 300 మిలియన్ల టన్నుల సామర్థ్యానికి చేరవచ్చన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో మొండి వైఖరిని వీడి ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### జూనియర్ కళాశాలకు కుర్చీలు వితరణ

**అగనంపూడి, సెప్టెంబరు 26:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అగనంపూడికి చెందిన ఆశ రాజ్ షైనింగ్ సొసైటీ ఆర్థిక సాయంతో పది ప్లాసిక్ కుర్చీలను సమకూర్చింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి పులగపూరి ఆశాలత ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబుకు గురువారం కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు భవిష్యత్తులోనూ కళాశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, సొసైటీ ప్రతినిధులు గుమ్మడి వరప్రసాద్, కిరణ్‌దాసన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నేత్ర పరీక్షలు

**అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 26:** విద్యార్థులు నేత్ర సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటి బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యురాలు కేవీఎన్ఆర్ సంధ్య సూచించారు. షీలానగర్‌లోని విశాఖ డెయిరీ హైస్కూల్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కరుణ కుమారి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సినిమా గైడ్

● **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా, గణేష్ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 54, టమాటా 46, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 26, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 26, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 30, మునక్కాడలు (కిలో) 90, అరటి కాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 90, బరబటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 40, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 36, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 54, కంద 64, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 530 |
| విజయనగరం | 534 |
| శ్రీకాకుళం | 534 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 98 |
| ఫారం ధర | -- | 118 |
| విత్ స్కిన్ | -- | 206 |
| స్కిన్‌లెస్ | -- | 216 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

# కమ్మేసిన కాలుష్యం..



పారిశ్రామిక ప్రాంతంలోని ఓ పరిశ్రమ నుంచి గురువారం ఉదయం వెలువడిన కాలుష్యం

**ఉక్కిరిబిక్కిరి అయిన పారిశ్రామిక ప్రాంత జనం**

**కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన**

**మల్కాపురం, సెప్టెంబరు 26:** పారిశ్రామిక ప్రాంతంలో వర్షం కురిసినా.. మబ్బులు కమ్మినా పలు పరిశ్రమలు ఇష్టారాజ్యంగా కాలుష్యాన్ని విడుదల చేస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జింక్ పరిశ్రమ ఉన్నప్పుడు దానినుంచి విడుదలయ్యే కాలుష్యం వల్ల అనేక మంది మృతి చెందడంతో పాటు కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానపడ్డారు. జింక్ పరిశ్రమను మూసివేసినప్పటికీ ప్రజలను కాలుష్యం భూతం వీడలేదు. మరికొన్ని పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో స్థానికులు నానాపాట్లు పడుతున్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అసెంబ్లీ సమావేశాలతో పాటు స్థానిక అధికారులు, టీడీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ కాలుష్యంపై ప్రస్తావించినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కానీ పరిశ్రమల యాజమాన్యాలు గానీ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. గురువారం ఉదయం మబ్బులతో చిన్నపాటి వర్షం కురుస్తున్న సమయంలో ఓ పరిశ్రమ నుంచి దట్టమైన తెల్లని కాలుష్యాన్ని విడుదల చేయడంతో అది పారిశ్రామిక ప్రాంతాన్ని కమ్మేసింది. దీంతో దగ్గు, కళ్ల మంట, శ్వాసకోశ వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కాలుష్య నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆందోళనలకు దిగుతాం



**-కోరాడ శ్రీనివాసరావు, టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు**

వివిధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలుష్యం వల్ల ఎంతోమంది పలు రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. కాలుష్య నివారణ కోసం ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం.



గాజువాక హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు



ఐటీఐలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

# విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**గాజువాక హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ప్రారంభం**

**గాజువాక, సెప్టెంబరు 26:** విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక హైస్కూల్‌లో కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ ల్యాబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ప్రయోగాలకు సైన్స్ ల్యాబ్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, తద్వారా మంచి జ్ఞానం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని అంశాల పట్ల అవగాహన పెంచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, కోరమాండల్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.జ్ఞానసుందరం, సీఎస్ఆర్ హెడ్ సి.జయగోపాల్, పలువురు అధికారులు, బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, హెచ్ఎం విజయప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

**ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**పెదగంట్యాడ:** కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వికాస్‌నగర్ ప్రభుత్వ మోడల్ ఐటీఐలో రూ.34 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ ప్రభుత్వ మోడల్ ఐటీఐలో గురువారం ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కలెక్టర్ రూ.32 లక్షల అంచనాతో దీనికి పిలుపునివ్వగా కోరమాండల్ యాజమాన్యం రూ.34 లక్షలు వెచ్చించడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులు త్వరితంగా ఉద్యోగాలను పొందగలుగుతారన్నారు. ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణతో పాటు పూర్తి స్థాయిలో కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు కూడా ఈ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ ఉపాధ్యక్షుడు, యూనిట్ హెడ్ ఎం.జ్ఞానసుందరం, సీఎస్ఆర్ హెడ్ సి.జయగోపాల్, హెచ్ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, ఐటీఐ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోనూ సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యం

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



రాసాలమ్మ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



పెందుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



92వ వార్డు పరిధి వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

**కూర్మన్నపాలెం, సెప్టెంబరు 26:** సంక్షోభంలోనూ సంక్షేమ పాలనను అందించే సత్తా ఒక్క కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు., ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా భావించి రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పింఛన్ల పెంపు, ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు వంటి వాటిని అమలు చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీని ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, ఎం.కనకరాజు, వి.శ్రీనివాస్, కాద శ్రీను, జి.వెంకటరావు, సుబ్బయ్య, రమేశ్, రాధ, తదితరులు పాల్గొన్నారు. అలాగే గురువారం రాత్రి 87వ వార్డు వడ్లపూడి సచివాలయంలో, 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో పల్లా శ్రీనివాసరావుతో పాటు నాయకులు గొర్లె వెంకునాయుడు, లక్కరాజు సోంబాబు, ఎస్.కనకరాజు, ఇందిరా ప్రియదర్శిని, ఎస్ఎస్ విజయరామరాజు, ఉరుకూటి శ్రీనువాసరావు, ఇందల రమణ, శివకుమార్, ఎం.రాము, రాజాన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల**

**పెందుర్తి/వేపగుంట:** సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే ఇళ్ల గోడలపై స్టికర్లను అతికించారు. అనంతరం జరిగిన సభలో పంచకర్ల మాట్లాడుతూ వంద రోజుల్లో సుస్థిరత పాలనతో ప్రజలకు మరింత చేరువయ్యామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఐతి సింహాచలం, జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, కూటమి నాయకులు డీబీఎల్ నాయుడు, వేగి పరమేశ్వరరావు, గొర్లె రామునాయుడు, పి.రాజేంద్ర ప్రసాద్, కిల్లి రమేశ్, పి.జితేంద్ర, ఆళ్ల రాము, తదితరులు పాల్గొన్నారు. అలాగే 94వ వార్డు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ గతంలో టిడ్కో ఇళ్ల కేటాయింపు జరిగి, రద్దయిన లబ్ధిదారులకు మళ్లీ కేటాయిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అమలు చేస్తామన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజా రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు గణబాబు వినతిపత్రం అందజేశారు. అనంతరం విజయవాడలో పారిశుధ్య పనులు చేపట్టిన కార్మికులను పంచకర్ల ఘనంగా సత్కరించారు. 94వ వార్డుకు చెందిన డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.లక్షా 60 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జెడ్పీ కె.హైమావతి, నాయకులు బొబ్బర నరసింహనాయుడు, మామిడి కిరణ్, నాగరాజు, పి.పార్వతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

**మాది పనిచేసే ప్రభుత్వం: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**

**గోపాలపట్నం:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేసే మంచి సర్కారుగా ప్రజల మన్నలు పొందుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 92వ వార్డు వెంకటాపురంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిక వంద రోజుల్లోనే ఎంతో పురుగోతి సాధించిదని, అందుకు నిదర్శనం ఎల్‌జీ పాలిమర్స్ దుర్ఘటన వల్ల ఇబ్బందులు పడుతున్న బాధితులకు మళ్లీ ఆర్థిక సహాయం అందించడమే తార్కాణమన్నారు. తొలుత విజయవాడ వరద బాధితులకు సహాయం చేసిన పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**62వ వార్డులో..**

**సింధియా:** జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాలమేరకు వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కాలనీలో గల ప్రతీ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో భాగంగా ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమం వివరించారు. క్యాక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యాక పూడ్చకుండా వదిలివేసిన గొయ్యి

# తవ్వారు.. వదిలేశారు!

**తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న శ్రామిక నగర్ వాసులు**

**ఆటోనగర్, సెప్టెంబరు 26:** జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రామిక నగర్‌లో తాగునీటి మరమ్మతుల పనుల నిమిత్తం తవ్విన గొయ్యను రెండు వారాలైనా పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడంతో రాత్రిపూట ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు పూర్తయ్యాక గోతులను పూడ్చకుండా వదిలివేయడం సమంజసం కాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

### సాయినాథునికి ప్రత్యేక పూజలు

**అగనంపూడి, సెప్టెంబరు 26:** గ్రేటర్ 85వ వార్డు పరిధి అగనంపూడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున సాయినాథున్ని నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు అలంకరించి పూజలు జరపగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం పలువురు భక్తులు విష్ణు సహస్ర, లలితా పారాయణం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, వ్యాస శర్మ, శంభుడు, రామారావు, సత్యనారాయణ, లీలావతి, పవన్, సత్యలక్ష్మి, పంకజం, సూరీడమ్మ, పద్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాక వుడా కాలనీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

### భారీ వర్షం: లోతట్టు ప్రాంతాలు జలమయం

**గాజువాక, సెప్టెంబరు 26:** గాజువాక పరిసర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచే వాన కురవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. చాలామంది గొడుగులు, రెయిన్ కోట్లు ధరించి రాకపోకలు సాగించారు. ఇప్పటికే గోతులమయంగా మారిన రహదారుల్లో వర్షపు నీరు చేరడంతో వాటి మీదుగా రాకపోకలు సాగించిన ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**వేపగుంట:** నాయుడుతోట, వేపగుంట, తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా నాయుడుతోట కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీటితో లారీ యార్డ్ ప్రాంతంలో ఇసుక మేటలు వేశాయి. అలాగే కృష్ణానగర్ శివారు ప్రాంతం, గౌతంనగర్ పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. వేపగుంట కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చిన నీరు చీమలాపల్లి రోడ్డులో తిష్ఠ వేసింది. అనేకచోట్ల బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులోనూ వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు కాసేపు అంతరాయం వాటిల్లింది.

### తినాథపురం రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం

**సింధియా, సెప్టెంబర్ 26:** ఎన్నో ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉన్న 62వ వార్డు త్రినాథపురం నుంచి పోర్టు క్వార్టర్స్‌కు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.కోటీ 98 లక్షల నిధులు మంజూరు చేసేందుకు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆమోదం తెలపడం పట్ల కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారని, వర్షాల సమయంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడంతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు తీర్మానించారన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయని కార్పొరేటర్ పేర్కొన్నారు.

### సేంద్రియ పంటలపై రైతులు దృష్టిసారించాలి



ప్రకృతి ఫల సేద్యం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సుజాత, పెంటబాబు, తదితరులు

**పెందుర్తి, సెప్టెంబరు 26:** సేంద్రియ పంటలపై రైతులు దృష్టిసారించాలని జాగృతి సంస్థ ఎండీ కందర్ప సుజాత అన్నారు. మండలంలోని పినగాడిలో గల ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఐదో సర్వసభ్య సమావేశం గురువారం సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రకృతి ఫల సేద్యంతో రైతు సాధికారిత సాధ్యమన్నారు. సంఘం చైర్మన్ వెన్నెల పెంటబాబు ఉద్యానవన పంట సాగు ద్వారా లభించిన ఆదాయంతో స్థల సేకరణ చేసి సంఘం నూతన కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. భవిష్యత్తులో చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, ఆవిస పంటలను వేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని భావితరాలకు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. తొలుత సంస్థ వ్యవస్థాపకుడు దివంగత కందర్ప రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేశారు. సంస్థ ప్రగతి నివేదికను ప్రకృతి ఫల సీఈవో ప్రవీణ్ చదివి వినిపించారు. ప్రకృతి ఫల సేద్యం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, కన్సల్టెంట్ రెడ్డి నాయుడు, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### శరన్నవ రాత్రి ఉత్సవాలకు పందిరి రాట



సీతానగరంలో పందిరి రాట వేస్తున్న దృశ్యం

**పెదగంట్యాడ, సెప్టెంబరు 26:** సీతానగరంలోని ఎన్టీఆర్ సెంటర్‌లో గురువారం శన్నరవ రాతిర ఉత్సవాలకు పందిరి రాట వేశారు. దుర్గమాంబ ఆటోస్టాండ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి రాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ఆటోస్టాండ్ యూనియన్ ప్రతినిధులు ఎస్.ఈశ్వరరావు, ఎస్.పెంటారావు, ఎం.నరిసింగరావు, ఎన్.రమణ, ఎం.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### 'విజ్ఞాన్'లో ఘనంగా ఆస్ట్రేలియా అడ్మిషన్ డే



**అగనంపూడి, సెప్టెంబరు 26:** దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆస్ట్రేలియాలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల సహకారంతో ఆస్ట్రేలియా అడ్మిషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియన్ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు ఆన్‌లైన్‌లో మాట్లాడారు. అడ్మిషన్, వీసా ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్ జీవితం, కెరీర్ అవకాశాల గురించి వారు వివరించారు. ఆస్ట్రేలియాలో చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ చైర్మెన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి, అసాధారణమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తాము ఎంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధు సూదనరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు పునరావృతం కానీయొద్దు: కలెక్టర్

**మహారాణిపేట, సెప్టెంబరు 26:** ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ ఎన్నికల విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 28లోగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, అనుబంధ పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్తవాటికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్వో మోహనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా హెరిటేజ్ వాక్**

జిల్లాలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను తెలిపేలా జిల్లా పర్యటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. గురువారం రాష్ట్ర పర్యటక శాఖ అధికారుల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఉన్న టౌన్ హాల్ నుంచి పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. చారిత్రక ప్రదేశాలను గుర్తించాలని కోరుతూ పర్యటక దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని గోడ పత్రికలను ప్రదర్శించారు. పర్యటక శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ ఫణి, జ్ఞానవేణి, ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### డ్వామా పీడీగా ఆర్.పూర్ణిమదేవి

**డాబాగార్డెన్స్:** డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్.పూర్ణిమదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారిణి



# ఎడతెరిపిలేని వర్షంతో అవస్థలు



జలమయమైన పూర్ణామార్కెట్ ప్రాంతం



ద్వారకానగర్ పౌరగ్రంథాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

**జగదాంబ కూడలి, సెప్టెంబరు 26:** నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం కుండపోతగా కురిసిన వర్షంతో పూర్ణామార్కెట్ లోపల, రోడ్డు పరిసరాలు జలమయమయ్యాయి. పూర్ణామార్కెట్ నుంచి కురుపాం మార్కెట్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడం వల్లే ప్రతీసారి చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని వ్యాపారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నుంచి వర్షం నీరు దుర్గాలమ్మ గుడి వైపు పొంగుతూ రావడం వల్ల ప్రధాన రహదారులు నీట మునిగాయని చిరువ్యాపారులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. కూరగాయల వ్యాపారుల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. వన్‌టౌన్ పరిసర ప్రాంతాల ప్రజలు వర్షంతో విలవిలలాడారు.

**సీతంపేట:** ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. రామాటాకీస్ డౌన్ రోడ్డు, శాంతిపురం రహదారుల్లో, ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం ఎదుట రోడ్డుపై వర్షం నీరు పెద్దఎత్తున పారింది. అటుగా వచ్చిన వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ద్వారకానగర్‌లో బీవీకే కళాశాల ఎదురు రోడ్డు, పౌరగ్రంథాలయం పక్కరోడ్డులో చెట్టు విరిగి పడింది. దీంతో రాకపోకలకు కొంతసేపు ఆటంకం కలిగింది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా చెట్టు కొమ్మలు తొలగించడానికి వీలుపడలేదు. దీంతో వాటి కింది నుంచే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించారు.

# పర్యాటకంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పట్టవు. దాంతో రూ.100 కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. ఇటీవలె క్రూయిజ్‌లను ఎలా రప్పించాలనే దానిపై టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో తెలియదు.

**పోర్టు నెత్తిన మౌలిక వసతుల బాధ్యత**

జిల్లాలో పర్యాటక కేంద్రాలు అనేకం ఉన్నాయి. కానీ అక్కడ పర్యాటకులకు మౌలిక వసతులు లేవు. ఇన్నాళ్లూ వాటి గురించి అధికారులు పట్టించుకోలేదు. విశాఖపట్నం పోర్టుకు క్రూయిజ్‌లో వచ్చే విదేశీ పర్యాటకులు ఆయా కేంద్రాలను సందర్శిస్తే...మౌలిక వసతులు తప్పనిసరి కాబట్టి అవన్నీ పోర్టు యాజమాన్యమే సమకూర్చాలని జిల్లా అధికారులు ఇటీవల తేల్చి చెప్పారు. క్రూయిజ్‌లు విశాఖ వచ్చేలోపు ఆ పనులన్నీ చేసే బాధ్యత అప్పగించారు.

**తొట్లకొండపై తాళం**

తొట్లకొండను పురావస్తు శాఖ నిధులతో అభివృద్ధి చేశారు. నిర్వహణను వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. అది బౌద్ధ కేంద్రం. దానికి విశిష్టతలు ఉన్నాయి. పర్యాటకులు అక్కడి కి వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ చెప్పాలనే ఉద్దేశంతో అక్కడ ఇంటర్ ప్రిటేషన్ రూమ్ ఒకటి నిర్మించారు. రెండు సంస్థల మధ్య సరైన అవగాహన లేకపోవడంతో దానికి తాళం వదిలేసి వదిలేశారు. అక్కడికి ఎవరైనా వెళితే బౌద్ధ ఆరామం చూసి రావాలే తప్ప దాని ప్రత్యేకత ఏమిటో తెలుసుకునే అవకాశం లేదు. అధికారుల తీరు ఎలా ఉంటుందనే దానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే.

**ఇంకెప్పుడు అందుబాటులోకి తెస్తారో..?**

పర్యాటక శాఖపై అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో నచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. అక్టోబరు నుంచి పర్యాటక సీజన్ ప్రారంభమవుతుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారు. వారు తొలుత పర్యాటక శాఖ వసతినే కోరుకుంటారు. గతంలో రుషికొండలో హరిత రిసార్ట్స్ ఉండేవి. వాటిని జగన్ ప్రభుత్వం కూలగొట్టడంతో కేవలం అప్పుఘర్ వద్ద ఉన్న యాత్రీ నివాస్‌లోనే బస చేయాల్సి వస్తోంది. ఇప్పుడు దానిని కూడా ఆధునికీకరణ పేరుతో మూసేశారు. అంచనా వ్యయం రూ.13 కోట్లకు తీసుకువెళ్లారు. ఇంత చేసినా ఇంజనీరింగ్ అధికారులు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగానైనా దానిని అందుబాటులోకి తెచ్చారా? అంటే ఇంకా లేదు. సీజన్ ముంచుకువస్తున్నా ఆ పనులు పూర్తిచేయడం లేదు. పర్యాటకులు ఆన్‌లైన్‌లో రూమ్ బుక్ చేసుకోవడానికి యత్నిస్తే 'నాట్ ఎవైలబుల్' అని చూపిస్తోంది. ఇది ప్రారంభమైతే 44 రూమ్‌లు అందుబాటులోకి వస్తాయి. విశాఖ వచ్చే పర్యాటకులకు కనీసం ఒక గదిని కూడా ఇవ్వలేని దుస్థితిలో ఆ శాఖ ఉందంటే వారి పనితీరు ఏ విధంగా ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు.

**అంతా ఆంగ్లమే**

పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు మూడు రోజులుగా రకరకాల పోటీలు, ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అదంతా ఇంగ్లీష్‌లోనే జరుగుతోంది. తెలుగు మచ్చుకైనా లేదు. ముందస్తుగా గురువారం 'హెరిటేజ్ వాక్' నిర్వహించారు. ఆ ప్రచార నినాదాలు కూడా ఇంగ్లీష్‌లోనే ఉన్నాయి. అధికారుల తీరు మారితే తప్ప విశాఖలో పర్యాటక రంగం ముందుకువెళ్లే అవకాశం కనిపించడం లేదు.

# అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం: విష్ణుకుమార్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

**అక్కయ్యపాలెం, సెప్టెంబరు 26:** ఉత్తర నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో గురువారం 26, 44, 55 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రవేశపెట్టి 2.12 లక్షల ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎవరికైనా ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.4 లక్షల సబ్సిడీ ఇస్తాయని చెప్పారు. 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం పొందవచ్చని విష్ణుకుమార్‌రాజు తెలిపారు. షాదీఖానాను తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్, 26వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముక్కా శ్రావణి, 26, 44, 55 వార్డుల కూటమి అధ్యక్షులు ముక్కా కిశోర్‌కుమార్, బండి కన్నా, రఘునాథ్, గౌరీ శంకర్‌నాయుడు, పడాల పరమేశ్, వీరబాబు, జడ్సీలు శివరాంప్రసాద్, రాము, సీవో బీఎస్ రత్నం పాల్గొన్నారు.

## 'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయొద్దు'



టెండర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

**అక్కయ్యపాలెం, సెప్టెంబరు 26:** పోర్టు ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయకుండా సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సీఐటీయూ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ఆవరణలో గురువారం టెండర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు లాభాలతో గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని 150 పడకల సామర్థ్యంతో ప్రారంభించారని, 35 వేల కుటుంబాలకు సేవలందిస్తోందని గుర్తు చేశారు. ఈ ఏడాది పోర్టుకు రూ.386 కోట్ల లాభం వచ్చినందున సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్తే వైద్యం వేలాది కుటుంబాలకు దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పోర్టు, డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రామలింగేశ్వరరావు, మారడపూడి ఆనంద్, త్రినాథ్ పాల్గొన్నారు.

## ఉక్కులో ఉద్యోగులు కుదింపు?

... 5వ పేజీ తరువాయి

ఉండాలి. కానీ 12,672 మందే ఉన్నారు. ఇంకా 8 వేల మందిని నియమించాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం పార్లమెంటులో ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ విశాఖ ఉక్కులో ఐదు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కొత్తవారిని ఎలాగూ తీసుకోవడం లేదు. ఉన్నవారిని కూడా బయటకు పంపించేందుకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ యత్నించడాన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**ఉత్పత్తికి తగ్గట్టుగా ఉద్యోగులు ఉండాలి**

విశాఖ ఉక్కు కర్మాగారానికి రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. కానీ ఇప్పుడు 4,500 టన్నులే ఉత్పత్తి చేస్తున్నారు. కేంద్రం ముడి పదార్థాలు సమకూరిస్తే 21 వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉద్యోగుల సంఖ్య తగ్గించుకుంటూ పోతే ఆ ఉత్పత్తి అసాధ్యం. ఈ విషయం తెలిసీ ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్ణయాలు తీసుకుంటున్నదంటే ఏదో కుట్ర జరుగుతోంది. సామర్థ్యానికి తగిన ఉద్యోగులు ఉండాల్సిందే.
**- అయోధ్యరామ్, కన్వీనర్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ**

## అర్బన్ తహసీల్దార్ ఆర్ఐగా ప్రేమలత

**సీతమ్మధార:** సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐగా ఆర్డీవో కార్యాలయం నుంచి వచ్చిన ప్రేమలత బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఇబ్రహీం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**అల్లిపురం, సెప్టెంబరు 26:** తిరుమల శ్రీవారి లడ్డు వివాద నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మదతుగా గురువారం స్థానిక 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట శ్రీ బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయాన్ని శుద్ధి చేశారు. అంతకుముందు ఈవో, అర్చకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులు గోపీకృష్ణ, కందుల నాగరాజు, ఆకుల రాజు, టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఘనంగా రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఉత్సవం**

జీవీఎంసీ 34వ వార్డు కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఉన్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవం గురువారం ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఆర్డీఓల బదిలీ

.. 5వ పేజీ తరువాయి

ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న చిన్నికృష్ణను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పాలకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీఓగా బదిలీ చేసి, అక్కడ ఉన్న హనుమంతు జయరాంను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇంకా వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీఓగా, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీ కలెక్టర్ బి.అఖిలను చీరాల ఆర్డీఓగా, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

## భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

సెల్లార్లలోకి ప్రవేశించింది. ఉద్యోగులు, విద్యార్థులు వర్షంలో తడుస్తూనే కార్యాలయాలు, విద్యాలయాలకు వెళ్లారు. శుక్రవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో ఒక్కో మండలంలో సగటున 1.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

# సుదీర్ఘంగా కౌన్సిల్ సమావేశాలు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ఇచ్చిన హామీ మేరకు చెత్తపన్నును రద్దు చేస్తున్నట్టు సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, ప్రత్యేకంగా దీనిపై తీర్మానం అవసరం లేదని అభ్యంతరం తెలిపారు. కావాలనుకుంటే చెత్తపన్ను రద్దు చేసిన సీఎం చంద్రబాబును అభినందిస్తూ తీర్మానం చేద్దామని ప్రతిపాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో టీడీపీ, జనసేన, వామపక్షాలు వ్యతిరేకించినా అడ్డగోలుగా ఆమోదించేసి, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం తిరిగి తీర్మానం కోరతారా?...అంటూ బాణాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు గంగారావు, స్టాలిన్ మాట్లాడుతూ ఆస్తిపన్నును ప్రస్తుతం వసూలుచేస్తున్న 0.13 శాతం నుంచి 0.10 శాతానికి తగ్గించేలా తీర్మానం చేయాలని మేయర్‌ను కోరారు. దీనికి టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన ఆస్తి పన్ను చట్ట సవరణపై కోర్టులో కేసు నడుస్తున్నందున దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్నారు. నీటి సరఫరా విభాగంలో కారుణ్య నియామకాలను ఇష్టారాజ్యంగా చేస్తున్నారని, నాలుగేళ్ల కిందట మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇటీవలే మృతిచెందిన వారి కుటుంబీకులకు వైసీపీ నేతల అండదండలతో అడ్డదారిలో ఉద్యోగాలు కల్పించడంలో ఆంతర్యమేమిటని టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదులిస్తూ ప్రస్తుతం కారుణ్య నియామకాలకు సంబంధించి 61 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారందరికీ వీలైనంత త్వరగా ఉద్యోగాలివ్వడంతోపాటు అడ్డదారిలో ఉద్యోగాలు పొందారనే ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు. జోన్-5లో నకిలీ పత్రాలతో ఏకంగా 1200 అసెస్‌మెంట్‌లు జారీచేసిన అప్పటి జోనల్ కమిషనర్ సింహాచలానికి తిరిగి నగరంలో ఎలా పోస్టింగ్ ఇచ్చారని టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నారావు ప్రశ్నించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని మూడేళ్లుగా కోరుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ బదులిస్తూ వచ్చే 45 రోజుల్లోగా దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 21వ వార్డు పరిధి కిర్లంపూడి లేఅవుట్‌లోని మునిసిపల్ గెస్ట్‌హౌస్‌కు అదనపు అంతస్తులు నిర్మాణం, ఇంటీరియర్ పనుల కోసం ఏకంగా రూ.4 కోట్ల పనులకు మేయర్ ముందస్తు ఆమోదం ఎందుకు తెలపాల్సి వచ్చిందని టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. కమిషనర్ ప్రతిపాదనలు పంపడంతోనే తాను ముందస్తు ఆమోదం ఇచ్చానని, దీనిపై ఏదైనా అనుమానం ఉంటే ఆయన్ను అడగాలని మేయర్ పేర్కొనడంతో టీడీపీ, జనసేన సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో సభలో కొంతసేపు అలజడి రేగింది. ముడసర్లోవ రిజర్వాయర్‌ను ఆనుకుని 85 ఎకరాల ఖాళీస్థలంలో సుందరీకరణ, పార్కుల ఏర్పాటుకోసం అధ్యయనం చేసి, ఆసక్తి చూపే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం పీపీపీ కింద ప్రాజెక్టును పూర్తయ్యేలా చూసేందుకు రూ.1.16 కోట్లతో కన్సల్టెన్సీని ఏర్పాటుచేసుకునే ప్రతిపాదనపై లోతుగా చర్చ జరిగింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ 836 ఎకరాల్లో విస్తరించి ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్‌లో ఎంత భూమి ఆక్రమణలకు గురైంది, ఎంతభూమిని రైల్వేకు కేటాయించారు, రూ.11 కోట్లతో ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల ఎన్ని ఎకరాలకు రక్షణ ఏర్పడింది?, గుర్రాల పార్కు నిర్మాణానికి జీవీఎంసీ అనుమతి ఉందా?, రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో అలాంటి నిర్మాణాలు చేయొద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలను ఎందుకు పాటించడం లేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ బదులిస్తూ గుర్రాల పార్కు పనులను ఆపేశామని, ఇటీవలే రైల్వే శాఖకు 55 ఎకరాల భూమిని అప్పగించేశామని, రిజర్వాయర్ ప్రాంతానికి సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించేలా సుందరీకరణ పనులు మాత్రమే చేసే ప్రతిపాదన ఉందని వివరించారు. నీటిశుద్ధిప్లాంట్ల వద్ద తాగునీటి శుద్ధి కోసం రూ.రెండు కోట్ల వ్యయంతో ఆలం కొనుగోలు ప్రతిపాదనపై చర్చ సందర్భంగా వైసీపీ కార్పొరేటర్లు పీవీ సురేష్, మహ్మద్‌ఇమ్రాన్, ఉరుకూటి చంద్రరావు మాట్లాడుతూ ఆలం (నీటిని శుద్ధి చేసేందుకు వినియోగించే రసాయనం) కొనుగోలులో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ఇకపై టెండర్లు, నాణ్యత విషయంపై ప్రత్యేక శ్రద్ధపెడతానని హామీ ఇచ్చారు. టీడీపీ కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, గాడు చిన్నికుమారి మాట్లాడుతూ క్లాప్‌వాహనాల నిర్వహణలో సిబ్బంది, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కేవలం ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెట్టేస్తున్నారని ఫిర్యాదు చేశారు. 90వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం ప్రతిపాదనను వైసీపీ నేత సూచన మేరకు ఎజెండాలో చేర్చినట్టు పేర్కొనడంతో ఆ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అభ్యంతరం వ్యక్తంచేశారు. వైసీపీ నేత చెబితే ఎజెండాలో చేర్చడం ఏమిటని మేయర్‌ను ప్రశ్నించారు. ఆ అంశాన్ని తిరస్కరించాలని కోరడంతో వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించడంతో కూటమి కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. చివరకు ఆ అంశంలో వైసీపీ నేత పేరు బదులు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రతిపాదించినట్టు సవరించడంతో ఆ అంశాన్ని ఆమోదించారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని కోరేందుకు అఖిలపక్ష కార్పొరేటర్ల బృందం ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను వైసీపీ, వామపక్షాల కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు ఎజెండాలో చేర్చినట్టు మేయర్ చదివి వినిపించడంతో కూటమి సభ్యులు అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్‌లోని 97 మంది కార్పొరేటర్లు ఏకగ్రీవంగా అఖిలపక్షం ఏర్పాటుకు తీర్మానం చేసినట్టు ప్రతిపాదించాలని, లేనిపక్షంలో ఆమోదించే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. దీంతో మేయర్ ఆ మేరకు టేబుల్ ఎజెండాను సవరించడంతో సభ్యులు ఆమోదించారు.

## కౌన్సిల్ రికార్డు

... 5వ పేజీ తరువాయి

ఉన్నందున, మేయర్ రాజీనామా చేయాలని కూటమి సభ్యులు పోడియం ముందు బైఠాయించారు. దీంతో మొదటి రోజు సభను బుధవారానికి మేయర్ వాయిదా వేశారు. రెండో రోజైన బుధవారం సభ ప్రారంభం కాగానే జీరో అవర్ కింద సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. రాత్రి తొమ్మిది గంటలు వరకూ జీరో అవర్ కొనసాగింది. తర్వాత ఎజెండాపై చర్చ ప్రారంభించారు. 14 అంశాలపై చర్చ జరిగేసరికి రాత్రి 11 గంటలు కావడంతో సభను గురువారానికి వాయిదా వేయాలని మహిళా కార్పొరేటర్లు కోరారు. దీంతో మేయర్ సభను వాయిదా వేశారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభం కావడంతో ప్రధాన ఎజెండాలోని మిగిలిన అంశాలు, అనుబంధ ఎజెండాలోని 27 అంశాలతోపాటు టేబుల్ అజెండా కింద తీసుకొచ్చిన ఎనిమిది అంశాలపై చర్చ జరిపారు. కాగా మూడు రోజుల సమావేశాల్లో కూటమి కార్పొరేటర్ల ఆధిపత్యం కనిపించింది. కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి సభలో వైసీపీ కార్పొరేటర్ల హవా కొనసాగింది. ప్రజలకు నష్టం కలిగించే అంశాలను విపక్షాలు వ్యతిరేకించినా మెజారిటీ ఉండడంతో వైసీపీ సభ్యులు ఏకపక్షంగా ఆమోదించేసుకునేవారు. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గి, టీడీపీ, జనసేన బలం పెరిగింది. దీంతో తాజా సమావేశంలో కూటమి కార్పొరేటర్ల ఆధిపత్యం కనిపించింది. ఇంతవరకూ వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నల వర్షం కురిపించడంతో వైసీపీ సభ్యులు ఖిన్నులైపోయారు. మేయర్‌తోపాటు వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావులను ప్రశ్నలు, ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. కౌన్సిల్ ఏర్పడిన తర్వాత తొలిసారి మాట్లాడే అవకాశం దక్కిందంటూ కూటమి సభ్యులతోపాటు వైసీపీ సభ్యులు కూడా సంతోషం వ్యక్తంచేయడం కనిపించింది.

# మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

బస చేశారు. గురువారం ఉదయం సింహాచలం వెళ్లి వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్న లోకేశ్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులు స్వీకరించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. పరస్పర అంగీకార బదిలీలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన వారికి పరిహారం, ఇతర సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్‌సర్వీస్‌మన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాలను వైసీపీ అండతో కొందరు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి అనే వారు మంత్రిని కలిశారు. డీఎస్సీ 2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యా దీవెన కింద బీసీ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ మంజూరుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే కారణంతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల వేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్ హత్య, కోడికత్తి శ్రీను కేసులను వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, నేతలతో మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కొండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.



స్వర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

## అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

**సింహాచలం, సెప్టెంబరు 26 :** వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క స్వర్ణ పుష్పంతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

## భీమిలి జోన్ ఏసీపీ బదిలీ

**భీమునిపట్నం, సెప్టెంబరు 26 :** భీమిలి జోన్ (జోన్ -1) పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి. శ్రీనివాసరావు ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు సుమారు ఏడాదిన్నర పాటు ఇక్కడ పని చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో జోన్ టూ ఏసీపీ శాస్త్రిని ఇన్‌ఛార్జిగా నియమించారు.

## నేడు అవంతి కళాశాలలో ఫ్రెషర్స్ డే

**భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 26 :** తగరపువలస సమీపంలో ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేడుకలకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా. జి. జయ సుమ, ఎన్ఎస్‌టీఎల్ అడిషినల్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు.

## 'టీ విత్ ఎవ్రీథింగ్' నాటిక రేపు

**రామ్‌నగర్, సెప్టెంబరు 26 :** హైదరాబాద్‌కు చెందిన థియేటర్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులోని పార్కు హోటల్‌లో టీ విత్ ఎవ్రీథింగ్ నాటకం ప్రదర్శించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకురాలు మాలా పాషా తెలిపారు. గురువారం ఆమె పార్కు హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. 1971లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ది టోర్న్ కర్టెన్స్ థియేటర్ గ్రూప్ ఆధ్వర్యంలో భారత్, అమెరికా, కెనడా, దుబాయ్ దేశాల్లో ఇప్పటివరకు వందకు పైగా నాటకాలను ప్రదర్శించామని చెప్పారు.

## బీఓఎస్ ఛైర్మన్‌గా నానాజీరావు

**వెంకోజీపాలెం, సెప్టెంబరు 26 :** ఏయూ గణిత శాస్త్ర విభాగం బీఓఎస్ ఛైర్మన్‌గా ఆచార్య జి. నానాజీరావు నియమితులయ్యారు. ఈమేరకు వీసీ ఆచార్య జి. శశిభూషణరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం తన కార్యాలయంలో నానాజీరావుకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నానాజీరావును విభాగాచార్యులు అభినందించారు. కాగా ఇటీవల నెల్లూరులో జరిగిన ఆల్ ఇండియా చెస్ టోర్నమెంట్‌లో ఏయూ పరిధిలో ఉన్న చాణక్య డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న విద్యార్థి ఆదిత్య వరుణ్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థి ఆదిత్య వరుణ్‌ను, కళాశాల ప్రతినిధులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయ్‌రావు గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

## నేడు మెగా వైద్య శిబిరం

**భీమునిపట్నం, సెప్టెంబరు 26 :** పట్టణంలోని కీటిన్‌పేట సెయింట్ పీటర్స్ చర్చిలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వన్ రియాల్టీ గ్రూప్స్ సీఈవో డా. కె. సురేష్‌బాబు తెలిపారు.గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలు, ఎముకలు, నేత్ర, చిన్న పిల్లలు, దంత, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులకు పరీక్షలు చేసి, మందులు అందజేస్తామని చెప్పారు.

### సినిమా గైడ్

● **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా, గణేష్ (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 54, టమాటా 46, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 26, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 26, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 90, బరబటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 40, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 54, కంద 64, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 530 |
| విజయనగరం | 534 |
| శ్రీకాకుళం | 534 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 98 |
| ఫారం ధర | -- | 118 |
| విత్ స్కిన్ | -- | 206 |
| స్కిన్‌లెస్ | -- | 216 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు



పాతపరదేశిపాలెంలో పొంగి ప్రవహిస్తున్న గంభీరం గెడ్డ

# జలమయం

- తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీరు

**ఎంవీపీకాలనీ, సెప్టెంబరు 26 :** ఎంవీపీ కాలనీలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. డబుల్ రోడ్డుపై నీరు భారీగా చేరడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల ఫుట్‌పాత్ దాటి, ఇళ్ల ద్వారబంధాల వరకూ నీరు చేరింది. 11వ వార్డులో కొన్ని వీధుల్లో బురద నీరు నిలిచిపోవడంతో పాదచారులు ఇబ్బంది పడ్డారు.

**సాగర్‌నగర్ :** సాగర్‌నగర్, రుషికొండ తదితర తీర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. ఉదయం 9.30 గంటలకు చిరు జల్లులు ఉండగా, మధ్యాహ్నం కుండపోత వర్షం పడింది. సాగర్‌నగర్ నుంచి ఎండాడ దసపల్లా లేఅవుట్‌కు వెళ్లే రహదారి జలమయమైంది. సుభాష్‌నగర్ కొండపై నుంచి రహదారిపైకి నీరు ప్రవహించడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఉరుములు మెరుపుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. సాగర్‌నగర్, రుషికొండ తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంది.

### పొంగి ప్రవహిస్తున్న గంభీరం గెడ్డ

**భీమునిపట్నం :** కాపులుప్పాడ మధుర గ్రామం పాతపరదేశిపాలెంలో గంభీరం గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. గురువారం పడిన వర్షానికి గెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో గెడ్డ ర్యాంప్ పైనుంచి నీరు పొంగి పొర్లుతుండడంతో అటువైపు జాతీయ రహదారికి వెళ్లేవారు, గ్రామంలోకి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.



ఎంవీపీ కాలనీలో 11వ సెక్టారులోని వీధుల్లో నిలిచిన నీరు

# ప్రయాణం..నరకప్రాయం

- అధ్వానంగా పట్టణ పరిధిలోని రోడ్లు
- అడుగుకో గొయ్యితో ఇబ్బందులు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- వర్షాలకు మరింత ఛిద్రం
- ప్రమాదాల బారిన వాహనదారులు



నగరపాలెం వంతెన వద్ద గోతులు పడిన రోడ్డు

**భీమునిపట్నం, సెప్టెంబరు 26 :** పట్టణ పరిధిలోని రోడ్లు రాళ్లు తేలి, గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగుకో గొయ్యి ఉండడం, ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.ముఖ్యంగా 4వ వార్డు కె.నగరపాలెం నుంచి మారికవలస వెళ్లే రహదారి, గొల్లలపాలెం, గ్రేహౌండ్స్ మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణాలు కష్టతరంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. కళా గ్రామంలో కల్వర్టు వద్ద గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బీచ్ రోడ్‌లో మంగమారిపేట రహదారి నగరపాలెం జంక్షన్ వద్ద ఉన్న రోడ్డు గోతులమయంగా మారింది. గంభీరం గెడ్డ వంతెన వద్ద కూడా రహదారి గోతులమయంగా మారింది. గోవుపేట, గంగడిపాలెం రహదారిలోనూ గతుకులు ఏర్పడ్డాయి. పట్టణంలోని చిన్న బజారు జంక్షన్‌లో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి తవ్విన గోతులను పూడ్చకపోవడంతో అటువైపుగా రాకపోకలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మేదరవీధి టెలీకం ఆఫీసు జంక్షన్ వద్ద, మినీ స్టేడియం వద్ద కూడా గోతులు ఏర్పడ్డాయి. ఏపీఆర్ఎస్ జంక్షన్ నుంచి నేరేళ్లవలస జంక్షన్, ఎగువపేట, గొల్లవీధి మీదుగా చిన్నబజారు వెళ్లే రహదారి కూడా గోతులమయంగా మారడంతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు.



గోతులతో ఉన్న కె. నగరపాలెం నుంచి గ్రేహౌండ్స్‌కు వెళ్లే రహదారి



వుడా లేఅవుట్‌లో కళా గ్రామం కల్వర్టు వద్ద భారీ గొయ్యి

## రోడ్డుపై మురుగు నీటితో అవస్థలు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

**వెంకోజీపాలెం,సెప్టెంబరు 26 :** జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలోని సింహాద్రిపురం తాగునీటి పంపుహౌస్ వాటర్ ట్యాంకు వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగి ప్రవహిస్తోంది.కొండవాలు ప్రాంతం నుంచి వస్తున్న మురుగు నీరు, మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగు కలిసి రోడ్డుపై వర దలా పారుతుండడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు ఒకవైపు మురుగు నీటి నుంచి వస్తున్న దుర్వాసన, మరోవైపు దోమల వ్యాప్తి వల్ల నరకయాతన అనుభవిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మరమ్మతుల్లో వాటర్ గేజ్ పరికరం



మరమ్మతులతో దిష్టిబొమ్మలా ఉన్న వాటర్ గేజ్

**వెంకోజీపాలెం, సెప్టెంబరు 26 :** జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీకాలనీ వద్ద ఉన్న సింహాద్రిపురం వాటర్ ట్యాంకు వద్ద నీటి నిల్వను తెలియజేసే వాటర్ గేజ్ ఏడాదిగా పని చేయడం లేదు. ఎప్పుడు చూసినా గేజ్ ముల్లు మూడులో ఉన్నట్టు కనిపిస్తుంది. ట్యాంకులో నీటి నిల్వ ఎంత ఉందో తెలుసుకోవడానికి దీన్ని ఏర్పాటు చేశారు. ఈ పరికరం పని చేయకపోవడంతో ఆపరేటర్ ట్యాంకు పైకి ఎక్కి తెలుసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే స్పందించి వాటర్ గేజ్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆనందపురం మండలంలో కూటమి నాయకుల ప్రచారం



15వ వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను చూపుతున్న కూటమి నాయకులు

# వంద రోజుల పాలనపై ప్రజల్లో సంతృప్తి

**'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కూటమి నాయకులు**

**కొమ్మాది, సెప్టెంబరు 26 :**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంద రోజుల పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు.గురువారం వైఎస్సార్ కాలనీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు,వార్డు టీడీపీ అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, మన్యాల సోంబాబు, జోన్-2 జడ్సీ సింహాచలం పాల్గొన్నారు. సేవానగర్ కాలనీలోనూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఉమామహేష్, కాలనీ సెక్రెటరీ భరత్, జనసేన నాయకుడు అరుణ్, భవాని, వసంతకుమారి పాల్గొన్నారు.

**ఆనందపురం :** తర్లువాడ పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, పిల్లా చిన్నారావు పాల్గొన్నారు.

**తగరపువలస :** జీవీఎంసీ 1, 2 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 2వ వార్డులో జరిగిన కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నరాణి, కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, నాయకులు నీలకంఠం, సూరిబాబు పాల్గొనగా, 1వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** జీవీఎంసీ 13వ వార్డు కామాక్షినగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇది మంచిప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, వార్డు కార్యదర్శి యల్ల మల్లి సురేశ్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల పాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తురకపూడి బాలస్వామి, పుష్ప, రాజమ్మ పాల్గొన్నారు.12వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది.ఈకార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షులు గాడి సత్యం, నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, 9వ వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద్ పాల్గొన్నారు. పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి కేతా సత్యన్నారాయణ, మద్దిల రాజేశ్ పాల్గొన్నారు.

**వెంకోజీపాలెం :** కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, కర్రి గౌరీ, సోని, వరలక్ష్మి, పెంటకోట ప్రకాశ్, జనసేన నాయకులు పచ్చితాల సాయిబాబా, బీజేపీ నాయకుడు కనకాల పాపారావు పాల్గొన్నారు. 16వ వార్డు ఇసుకతోటలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, జి. అప్పన్న, పాల్గొన్నారు.

**భీమునిపట్నం (రూరల్) :** నగరపాలెంలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తమ్మిన వెంకట రమణపాత్రుడు, మాజీ సర్పంచ్ రాము, జనసేన నాయకుడు నానాజీ పాల్గొన్నారు. ఏడు, ఎనిమిది వార్డుల్లోనూ కార్యక్రమం జరిగింది.



హవనం చేస్తున్న వైదికులు

## రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం

**సింహాచలం, సెప్టెంబరు 26 :** సింహగిరిపై గంగధార సమీపంలో ఉన్న సీతారామస్వామి దేవాలయంలో సంక్షిప్త రామాయణ హవనం గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకుని ప్రతి నెలలో ఒకసారి ఈ హవనాన్ని చేస్తారు. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతంగా శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచారు. లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి బింబారాధన, కలశారాధన చేసిన తరువాత ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన జరిపారు. రామాయణంలోని ప్రథమ కాండ బాలకాండ (సంక్షిప్త రామాయణం)ను, షడక్షరీ మంత్రాన్ని జపిస్తూ హవనాన్ని జరిపారు. పూర్ణాహుతి చేసి పూర్ణకలశంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు.

## కృష్ణాకాలనీలో పాన్‌షాప్ దగ్ధం

**భీమునిపట్నం, సెప్టెంబరు 26 :** పట్టణంలోని కృష్ణాకాలనీ బస్‌స్టాప్ పక్కనున్న పాన్‌షాపు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కాగా పక్కనున్న పీతల వెంకటరావు టైలరింగ్ దుకాణం పాక్షికంగా దెబ్బతింది. రిక్షా కార్మికుడు తౌడకు ప్రభుత్వం కృష్ణాకాలనీలో ఇల్లు మంజూరు చేయడంతో అక్కడ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారాం అర్ధరాత్రి దాటిన తర్వాత 3.15 గంటల సమ యంలో దుకాణం నుంచి మంటలు రావడాన్ని స్థానికులు గుర్తించి తౌడుకు సమాచారం ఇచ్చారు. అయన ఇంటినుంచి వచ్చేలోగా మంటలు వ్యాపించడంతో షాప్ కాలిబూడిదైంది. తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. ప్రమా దానికి గల కారణాలు తెలియరాలేదు. కార్పొరేటర్ గంటా అప్పలకొండ, గంటా నూకరాజు బాధితులను పరామర్శించి, ప్రభుత్వ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికుల నిరసన



రవీంద్రనగర్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

**ఆరిలోవ, సెప్టెంబరు 26 :** జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్ కూడలిలో భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎ.రమణ మాట్లాడుతూ ఇసుక ధర పెరగడం వల్ల కార్మికులకు పనులు ఉండడం లేదన్నారు. రవీంద్రనగర్ కూడలిలో నిత్యం సుమారు 20 మంది కార్మికులు పని కోసం వస్తుంటారని, వారిలో పది మందికి కూడా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉందన్నారు. సీఐటీయూ ఆరో జోన్ కార్యదర్శివర్గ సభ్యుడు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు మూడు టన్నుల ఇసుక ధర రూ. 13,000 ఉండేదని ప్రస్తుతం రూ. 21,000 అయ్యిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిన నాయకులు ధరలు విపరీతంగా పెంచారని విమర్శించారు. కార్యక్రమలో కార్మికులు నాగరాజు, సీహెచ్ రాము, సన్యాసమ్మ, సూర్యనారాయణ, ఎస్‌కే వల్లీ, జల్లు శ్రీను పాల్గొన్నారు.

## వరద బాధితులకు రూ.1.12 లక్షల ఆర్థిక సాయం

**ఆనందపురం, సెప్టెంబరు 26 :** మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో ఉన్న న్యూలైఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు విజయవాడ, కేరళలోని వరద బాధితులకు రూ. 1.12 లక్షల విరాళం అందజేశారు.ఈ మొత్తాన్ని వారు పాఠశాల డైరెక్టర్ కె. శ్యామ్ మాథ్యూస్‌కి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సేకరించిన మొత్తాన్ని వరద బాధితులకు పంపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ శ్యామ్, ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి



జగన్‌తో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శివనందీష్

**భీమునిపట్నం, సెప్టెంబరు 26 :** వైసీపీ అధినేత జగన్‌ను మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు. ముత్తంశెట్టితో పాటు వైసీపీ యువజన విభాగం నాయకుడు ముత్తంశెట్టి శివనందీష్ కూడా ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మధురవాడ, సెప్టెంబరు 26 :** మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చంద్రంపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రంపాలెం, మధురవాడ మెయిన్‌రోడ్, దుర్గానగర్-1, దుర్గానగర్-2, కృష్ణానగర్, పోర్టుకాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

## కందిరీగల దాడిలో వ్యక్తి మృతి



**పద్మనాభం, సెప్టెంబరు 26 :** కందిరీగల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. కోరాడ గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు (47) ఈనెల 17న తన పొలంలో పనిచేస్తుండగా కందిరీగలు దాడి చేశాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఈనెల 25న కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గాభవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.